క్లుప్తంగా

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికను గురువారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మధుబాబు, మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరవుతారని చెప్పారు.

వైద్యం నిమిత్తం రూ.50 వేల ఆర్థిక సాయం



పిడుగురాళ్ల: మండలంలోని కొత్తగణేశునిపాడులో మంచంలో ఉన్న వ్యక్తికి ఆదే గ్రామానికి చెందిన కందుల శ్రీనివాసరావు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. గ్రామానికి చెంది జోగిపర్తి నరసింహారావు గత ఏడాది హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పటి నుంచి వైద్యం చేయించుకుంటూ బెడ్‌కు పరిమితమయ్యాడు. ఆర్థిక సహాయం కోరగా దివంగత కందుల పుల్లయ్య మస్టారు జ్ఞాపకార్థం కుమారుడు కందుల శ్రీనివాసరావు సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్వర్ణ సుబ్రహ్మణ్యం, గజవల్లి తిరుపతిరావు, చల్లగుండ్ల రాంబాబు, నీరుమళ్ల శ్రీనివాసరావు, కొత్త మల్లికార్జునరావు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన



మాచర్ల: విద్యతోనే పేదరికం నిర్మూలన సాధ్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా ఇదే విధంగా అత్యుత్తమ మార్కులు సాధించి తల్లి దండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్క విద్యార్థి భవిష్యత్‌లో అత్యున్నత స్థానంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, ప్రతినిధులు రామకృష్ణ, శ్రీధర్ గుప్తా, సదాశివ రాజు, హరిష్ చంద్ర, పాఠశాల సిబ్బంది సైదారావు, అంజయ్యనాయక్, శ్రీలక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

కనుల వందువగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



నకరికల్లు: స్థానిక కొండపై గల ఆదిలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ వేడుక మంగళవారం కనుల వందువగా జరిపించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి వారి కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు దంపతులు కల్యాణ వేడుకలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కొడవటికంటి మధుసూధనాచార్యులు, పాండురంగాచార్యులు, శ్రీకాంత్‌చార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా స్వామివారికి 108 కలశములతో అభిషేకాలు చేశారు. పంచామృతస్నపన గావించి ప్రత్యేకంగా అలంకరించారు. పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

ఆస్తి విషయమై ఘర్షణ.. కేసు నమోదు

క్రోసూరు: మండలంలోని హసనాబాద్ గ్రామంలో తల్లిదండ్రులు ఆస్తి రాయాలని కుమారుడు ఒత్తిడి చేస్తూ ఘర్షణ పడటంపై ఇరువురు చేసుకున్న ఫిర్యాదుపై ఎస్‌ఐ రవిబాబు కేసు నమోదు చేసినట్లు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన దాచేపల్లి నూర్జహాన్, దాచేపల్లి హుస్సేన్‌లకు నలుగురు కుమారుల్లో హసనాబాద్‌లో నివసిస్తున్న ఒక కుమారుడు దాచేపల్లి దరియా హుస్సేన్, భార్య మస్తాన్‌బీ కలిసి తల్లిదండ్రులు ఆస్తి రాసి ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ విషయమై తల్లిదండ్రులు, కుమారుడు, కోడలు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఇరువురు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువురి ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



శిథిలావస్థకు చేరుకుంటున్న ఎస్‌కేబీఆర్ మున్సిపల్ పార్క్



వ్యర్థాలతో నిండిపోయిన దృశ్యం

ఆహ్లాదం ఎంతెంత దూరం

- వ్యర్థాలు, పిచ్చిచెట్లతో నిండిపోయిన పార్కు
- మధ్యలో నిలిచిపోయిన వాకింగ్ ట్రాక్ నిర్మాణం
- మున్సిపల్ ప్రాంగణంలో ఉన్న ఎస్‌కేబీఆర్ పార్కును పట్టించుకోని పాలకులు



పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలోని ఎస్‌కేబీఆర్ మున్సిపల్ పార్క్

మాచర్లరూరల్: అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువవుతోంది. పండుగ, వేసవి సెలవులలో చిన్నారులు ఆటల కోసం, వృద్ధులు, మహిళలు ఆహ్లాదకరం వెతుకులాడుతున్నారు. పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలోని శ్రీకాసు బ్రహ్మనందరెడ్డి మున్సిపల్ పార్కును పాలకులు పట్టించుకోకపోవటంతో పిచ్చి చెట్లు, వ్యర్థాలతో నిండిపోయింది. ఈ పార్కును చూసి రావాలంటే చిన్నారులు, మహిళలు భయపడుతున్నారు. పార్కు శిథిలావస్థకు చేరింది. సుమారు 60 వేలకు పైగా జనాభా కలిగిన పట్టణంలో సరైన వాకింగ్ ట్రాక్, ఉద్యానవనం లేక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ శివారులోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో వాకర్స్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన కొద్దిపాటి సౌకర్యాలతో ఉపశమనం పొందుతున్నారు. ఉన్న పార్కులను అభివృద్ధి చేసి జనాభాకు తగ్గట్టుగా కొత్త వాటిని ఏర్పాటు చేయటంలో పాలకులు నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారు.

మూలకు చేరిన వాకింగ్ ట్రాక్..

మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని పంప్ హౌస్ వద్ద ఉన్న సమ్మర్ ట్యాంక్ క్వారీ చుట్టూ రూ.96 లక్షల అంచనాలతో 14వ ఆర్థిక సంఘ నిధులతో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి 2023 ఏప్రిల్‌లో అప్పటి పురపాలకశాఖ మంత్రి ఆదిములపు సురేష్ శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో కొంత భాగంలో క్వారీ సమ్మర్ ట్యాంక్ చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ కోసం మట్టిని పోసి కాంక్రీట్ వాల్‌ను కూడా నిర్మించారు. అలాగే సేదతీరేందుకు చెట్లు, బెంచీలను కూడా నిర్మించారు. మారిన ప్రభుత్వ నేపథ్యంలో ఈ వాకింగ్ ట్రాక్ నిర్మాణాన్ని ప్రస్తుత అధికారులు పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇది పూర్తి చేసి పట్టణ ప్రజలకు అందిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.



సగం నిర్మాణం పూర్తయిన వాకింగ్ ట్రాక్

పెండింగ్ చలానాలు చెల్లించండి

వాహన తనిఖీలు నిర్వహించిన సీఐ

నరసరావుపేటటౌన్: పెండింగ్ చలానాలు సత్వరమే చెల్లించాలని వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ వాహనదారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహన పరివార్ ద్వారా ఆన్‌లైన్‌లో పెండింగ్ చలానాలు చెల్లించాలన్నారు. చలానాలు చెల్లించని వాహనాలు తనిఖీల్లో పట్టుబడిన సమయంలో సీజ్ చేస్తామన్నారు. ఇప్పటికే పెండింగ్ చలానాలపై మైకు ద్వారా అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా మైనర్ యువకులు వాహనాలు నడుపుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. మైనర్‌లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ విజయ్ చరణ్

థియేటర్ల తనిఖీ..

పట్టణంలోని సినిమా థియేటర్లను పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు థియేటర్లు, పార్కింగ్ ప్రదేశాలు, రద్దీ ఉండే ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు సీఐ చరణ్ తెలిపారు. వ్యాపారులు అప్రమత్తంగా ఉండి అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ఏదైనా అనుమానస్పదంగా ఉంటే వెంటనే సమాచారాన్ని పోలీసులకు అందజేయాలన్నారు.

జవాన్ మురళీ ధైర్యసాహసాలు వెలకట్టలేనివి

అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మాడా మల్లికార్జునరావు

సత్తెనపల్లి: దేశం కోసం పోరాడి వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ మృతి యావత్ దేశానికి దిగ్భ్రాంతి కలిగించిందని, మురళీనాయక్ ధైర్య సాహసాలు వెలకట్ట లేనివని అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మాడా మల్లికార్జునరావు అన్నారు. భారత్–పాక్ మధ్య యుద్ధంలో మురళీనాయక్ వీర మరణం చెందడంతో పట్టణ గాంధీ చౌక్ వద్ద అభ్యుదయ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో మంగళవారం వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాడా మల్లికార్జునరావు మాట్లాడుతూ పాకిస్తాన్‌తో యుద్ధంలో జవాన్ మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వీర జవాన్ మురళీనాయక్ త్యాగం భరత జాతి ఎప్పటికీ మరువదన్నారు. వీర మరణం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. భారత్ మాతాకు జై.. వందేమాతరం.. జోహార్ వీర జవాన్‌లు.. జోహార్ అని నినదించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మారూరు లింగారెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, నాయకులు కూనాగు వెంకటేశ్వర్లు(బుజ్జి), మద్ది భాస్కర్, షేక్ జాకీర్, మైసూర్ మేస్త్రి, కొత్తూరు విశ్వేశ్వరరావు, ఖాజావలి, పిల్లుట్ల ఆంజనేయులు, నాసరయ్య, దేవతి సుబ్బారావు(మెమంటో), ఆత్మకూరు హరినాథ్, బచ్చు రామసుబ్బారావు, సంకుల తిరుమల రావు, వాకుమళ్ల చెంచిరెడ్డి, మారెళ్ళ స్వామి, చేపూరి వెంకటేశ్వర్లు, తిరుమల పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో…

దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరమరణం పొందిన మురళీనాయక్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాడని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ అన్నారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చిన్నం మణిబాబు, సీనియర్ న్యాయవాదులు దాసరి జ్ఞాన్ రాజ్‌పాల్, పూజల వెంకట కోటయ్య, కళ్ళం వీర భాస్కరరెడ్డి, సయ్యద్ అబ్దుల్ రహీమ్, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, దివ్వెల శ్రీనివాసరావులు మాట్లాడారు. వీర మరణం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బుర్రి సైదయ్య, కొల్లా వెంకటేశ్వరరావు, మద్దినేని వెంకట చలపతిరావు, బత్తిన శ్రీనివాసరావు, గుజ్జర్లపూడి సురేష్, తిరుమల, నరిశెటి వేణుగోపాల్, చావా బాబురావు, గంటా వెంకట శివ, అనుమోలు జయరాం తదితరులు పాల్గొన్నారు.



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లికార్జునరావు, నాయకులు



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

వైభవంగా పౌర్ణమి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: పట్టణ రైల్వేస్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైభవంగా వైశాఖ మాస పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీవారికి స్నపన తిరుమంజనం మంగళవారం శోభాయమానంగా జరిగింది. విశేషంగా 51 కేజీల మల్లెలతో మూలమూర్తులకు పుష్పాభిషేకం, మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ శ్యాము ఆచార్య రామానుజ స్వామి గరుడాళ్వార్ మండపంలో వేంచేసి ఉన్న గరుడాళ్వార్ మూర్తికి పూజలు నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు అత్యంత ఇష్టమైన, శక్తివంతమైన గరుడ వాహనంపై పుర వీధులలో దర్శనమిస్తూ భక్తులకు అభయప్రదానం చేశారు. ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గరుడ ముద్ద, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు, శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం




నకరికల్లు: క్రీస్తు బోధనలు ఆచరణీయమని గుంటూరు ఆర్‌సీఎం బిషప్ చిన్నాబత్తుని భాగ్యయ్య అన్నారు. మండలంలోని తురకపాలెం గ్రామంలో చర్చి ఫాదర్‌గా కొండవీటి రాజమోహన్ 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా అలాగే ఫాతిమామాత చర్చి రజతోత్సవ వేడుకలను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ నాగోతు శౌరయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 54 మంది మత గురువులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో ఫాదర్‌లు నరిశెట్టి గోవయ్య, నరిశెట్టి కిషోర్, విచారణ ఫాదర్‌లు నరిశెట్టి పౌలురాజు, మల్లవరపు జోసఫ్, సర్పంచ్ నాగోతు దాసయ్య, ఉప సర్పంచ్ నాగోతు బాలాస్వామి, దౌపాటి బాబు, నరిశెట్టి విజయ్, మల్లవరపు ఇన్నయ్య, నాగోతు సుందరరాజు తదితరులు పాల్గొన్నారు.

వేస్ట్ పిక్కర్స్‌కు మెరుగైన జీవన భృతి కల్పించేందుకే 'నమస్తే'

మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: పురపాలక సంఘ పరిధిలో నిత్యం చెత్త సేకరించి దానిలోని ప్లాస్టిక్‌ను వేరు చేసి వాటిని విక్రయిస్తూ వచ్చే ఆదాయంతో జీవితాన్ని కొనసాగిస్తున్న ప్రజలకు మెరుగైన జీవన భృతి కల్పించేందుకు ప్రభుత్వం నమస్తే కార్యక్రమాన్ని అమలు చేయనుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం చెత్త నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేసి విక్రయిస్తూ వచ్చిన ఆదాయంతో జీవితాన్ని కొనసాగిస్తున్న ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్స్‌ను గుర్తించి వారిని వేస్ట్ పిక్కర్స్ మొబైల్ యాప్‌లో ఆన్‌లైన్ చేయుట జరిగిందన్నారు. పట్టణ పరిధిలో 45 మందిని గుర్తించగా 35 మందికి ఇప్పటికే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తికాగా మిగిలిన 10 మందికి ఆధార్ కార్డులో చిన్న చిన్న లోపాల కారణంగా ఆగాయన్నారు. వాటిని కూడా వెంటనే ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. వేస్ట్ పిక్కర్స్ నమస్తే రిసోర్స్ పర్సన్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్స్ మొబైల్ యాప్‌లో ఆన్‌లైన్ చేయడం వలన వారికి అనేక ప్రయోజనాలను ప్రభుత్వం కల్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారధి, మెప్మా ప్రతినిధి ఖాజావలి, సచివాలయ సిబ్బంది, శానిటరీ మేస్త్రీలు, వేస్ట్ పిక్కర్స్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ఆనంద్‌కుమార్

పాలకేంద్రం సభ్యుడు కుటుంబానికి ఆర్థిక సహాయం



పెదపాలెం(క్రోసూరు): అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామంలోని సంగం డెయిరీ సభ్యుడు బయ్యావరపు గంగయ్య గత నెలలో మృతి చెందటంతో ఆయన డెయిరీలో వెల్ఫేర్ స్కీము సభ్యుడిగా ఉన్నందున మంగళవారం మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు రెంటపాళ్ల డెయిరీ మేనేజరు టి.గోపి తెలిపారు. మృతుని నామినీ బి.వెంకటేశ్వర్లుకు రూ.60 వేలు చెక్కును అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరేష్, కార్యదర్శి చిరుమామిళ్లపల్లి నరసింహారావు, పాలకవర్గ సభ్యులు, అధ్యక్షుడు పాటిబండ్ల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయలో నూరుశాతం ఉత్తీర్ణత



ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయ

నాదెండ్ల: సీబీఎస్‌సీ ఫలితాల్లో ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు సత్తా చాటారు. పదో తరగతి తొలి బ్యాచ్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. 30 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ సూరజ్‌కుమార్ శ్రీవత్సవ తెలిపారు. పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థుల్లో 500 మార్కులకు గాను 437 మార్కులు సాధించి కారసాల రాగప్రియ మొదటిస్థానం సాధించింది. రెండో స్థానంలో 435 మార్కులతో కాట్ర తపస్విని, మూడో స్థానంలో 425 మార్కులతో షేక్ ఫిర్‌దొస్ తస్వీర్ నిలిచారు. ఇరవై మందికి పైగా విద్యార్థులు 400 పైబడి మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. 2019–20 విద్యాసంవత్సరంలో చిలకలూరిపేట నియోజకవర్గానికి కేంద్రియ విద్యాలయం మంజూరైంది. అప్పట్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. పాఠశాలలో తొలి ఐదో తరగతి బ్యాచ్ ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారు.

క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి సన్నాహాలు

స్థలంలో మార్కింగ్ చేసిన ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లు

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో జిల్లా ప్రజలకు మరో ప్రభుత్వ హాస్పిటల్ అందుబాటులోకి రానుంది. కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ హాస్పిటల్‌కు పక్కనే ఉన్న 75 సెంట్ల స్థలంలో సుమారు రూ.36 కోట్ల వ్యయంతో 75 బెడ్ల క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ) నిర్మాణం చేయబోతున్నారు. ఇప్పటి వరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఆధీనంలో ఈ స్థలం ఉండగా దానిని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించారు. మంగళవారం హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి సమక్షంలో ఏపీఎంఎస్ఐడీసీకి చెందిన ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సీవీ రమణ, డెప్యూటీ ఇంజనీరు హనుమంతరావు నాయక్, ఏఇ సాయి, సిబ్బంది కలిసి స్థలాన్ని పరిశీలించి మార్కింగ్ నిర్వహించారు. సీసీయూ నిర్మాణాన్ని రూ.18.9 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారని, అందులో రూ.11.40 కోట్లతో వైద్యపరికరాలు ఏర్పాటు చేయనున్నారని డాక్టర్ లక్కిరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు టెండర్ పిలవటం జరిగిందన్నారు. కాంట్రాక్టర్ నిర్ధారణ జరిగిన తర్వాత నిర్మాణం ప్రారంభమౌతుందని పేర్కొన్నారు.



సీసీయూ నిర్మాణ స్థలంలో ఇంజినీర్లతో చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

చిలకలూరిపేట: మహిళలు క్యాన్సర్ వ్యాధిపట్ల అవగాహన కలిగి ఉండాలని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని చెప్పారు. రామకృష్ణ మెమోరియల్ నర్సింగ్ హోమ్, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఒమేగా క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో మంగళవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరం ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి కారణంగా మహిళలు క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒమేగా ఆసుపత్రికి చెందిన రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ గీతా రుక్మిణి మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడం వలన ఎన్నో జీవితాలకు శాపంగా మారుతున్నదన్నారు. తొలినాళ్లలో గుర్తించకపోవడంతో ఎంతో మంది మహిళలు ఈ వ్యాధి బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ మహిళలకు ఎక్కువగా సోకే క్యాన్సర్లలో నాల్గొదన్నారు. రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా 45 మంది మహిళలకు గర్భాశయ, 40 మంది రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్టులు డాక్టర్ కొల్లా హేమంతిదేవి, డాక్టర్ కందిమళ్ల జయమ్మ, డాక్టర్ వెల్లటూరి రాణి, డాక్టర్ లావు అరుణతో పాటు డాక్టర్ పెద్దబ్బాయి, క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గట్టు సరోజిని

ఆత్మస్థైర్యం పెంపొందించటానికే కిశోరి వికాసం

సత్తెనపల్లి: కౌమార బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి కిశోరి వికాసం ద్వారా శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీ ప్రమీల అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సత్తెనపల్లి పరిధిలోని 8వ వార్డు క్రిస్టియన్ పేటలోని ఒకటి, రెండు సెంటర్లలో కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమంలో భాగంగా సెక్షన్–4లో మంగళవారం బాలల హక్కుల రక్షణ, పీవోసీఎస్‌వో చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడమే లక్ష్యంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం, ఇతర శాఖలను సమన్వయం చేసుకొని సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణలత మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి ప్రారంభమైన కిశోరి వికాసం జూన్ 10వ తేదీ వరకు జరుగుతుందన్నారు. 14–18 ఏళ్ల బాలికలు, బడి మానేసిన 11–14 పిల్లలను గుర్తించి వారిని గ్రూపులుగా విభజించి ఆయా అంశాలపై ఆయా ప్రాంతాల్లో బాలికలకు అనువైన సమయంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీఎంఎస్‌కే ఆషా, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు ఉన్నారు.



చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత

సొలసలో చక్రస్నాన మహోత్సవం

ముగిసిన రంగనాథుడి బ్రహ్మోత్సవాలు

యడ్లపాడు: భక్తిశ్రద్ధలతో నిండి, మంగళ ధ్వనులతో మారుమోగిన సొలస గ్రామం ఆధ్యాత్మిక ఆనందానికి కేంద్రంగా మారింది. శ్రీభూ సమేత రంగనాయక స్వామి ఆలయంలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య పూజలతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం బిందుతీర్థస్నానం, అర్చనలు, బలిహరణ, వసంతోత్సవం, ప్రధానంగా చక్రస్నానం నేత్రానందంగా జరిగాయి. స్వామివారి చక్రాన్ని తీర్థంలో భాగస్వాములై ఈ పరమ పవిత్ర క్షణానికి భక్తజనం పులకించిపోయారు.

శాస్త్రోక్తంగా….

సాయంత్రం 7 గంటలకు విశ్వక్సేనుడి యాత్రతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వాహనంపై ఊరేగించారు. ఆలయంలో అంకురార్పణ సందర్భంగా ఆవాహనం చేసిన దిక్పాలకులకు ఉద్వాసన కార్యక్రమం నిర్వహించి, గరుడల్వార్ చిత్రపటంతో కూడిన వస్త్రాన్ని ధ్వజస్తంభం నుంచి అవరోహించడం ద్వారా బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఆలయ అర్చకులు, ధర్మకర్తలు ఈ కార్యక్రమాలను నిర్విఘ్నంగా నిర్వహించడాన్ని భక్తులు ప్రశంసించారు. అర్చకులకు ఆలయ మర్యాదలతో సన్మానాలు నిర్వహించగా, స్వామివారి సేవలో పాల్గొన్న ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక సంతృప్తితో మునిగిపోయారు.

నేటి కార్యక్రమాలు…

బుధవారం ఉదయం రంగనాయకునికి వివిధ రకాల పుష్పాలతో శ్రీ పుష్పయాగం, సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, అనంతరం పవళింపు సేవ జరగనున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికారులు పిలుపునిచ్చారు.



చక్రస్నానం చేస్తున్న దృశ్యం